మన చౌరాస్తా
2
22.08.2024 గురువారం
epaper.manachourasta.com





# తల్లీ సల్లంగ చూడు..

## వాసవీ మాతకు లక్ష పుష్పార్చన

**జనగామ, మన చౌరాస్తా :** శ్రావణమాసం పురస్కరించుకొని పట్టణంలోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో అమ్మవారికి 21 రకాల పూలతో లక్ష పుష్పార్చన, సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం వాసవీ మాత ట్రస్ట్ నూతన భవనం గృహ ప్రవేశ కార్యక్రమం కూడా నిర్వహించారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షులు పజ్జూరి గోపయ్య, బుద్ధ రమేష్, పజ్జూరి లక్ష్మీనరసయ్య, మహంకాళి హరిచంద్ర గుప్తా, బిజ్జాల నవీన్ కుమార్, జైన రమేష్, అయిత శ్రీనివాస్, అరుగుల శ్రీనివాస్, రామిని రాజేశ్వర్, పుల్లూరి శ్రీనివాస్, పజ్జూరి జయహరి, గట్టు వెంకటేశ్వర్లు, యాంసాని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఎల్ఆర్ఎస్ వివరాలను సరిగా నమోదు చేయాలి

- ప్రతి మండలంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలి
- కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**జనగామ, మన చౌరాస్తా :** ఎల్ఆర్ఎస్ యాప్ లో దరఖాస్తుదారుల వివరాలను సరైన విధంగా నమోదు చేయాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లాలోని సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని ప్రధాన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ తో కలిసి ఎంపీడీఓలు, ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులతో ఎల్ఆర్ఎస్ (ల్యాండ్ లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీం) యాప్ పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో మొత్తం ఎల్ఆర్ఎస్ కింద 52,000 దరఖాస్తులు వచ్చాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతాంశంగా ఈ ఎల్ఆర్ఎస్ పై ప్రత్యేక దృష్టి సారించిందని పేర్కొన్నారు. పంచాయతీ, రెవెన్యూ, నీటిపారుదల శాఖలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు, ఆర్ఐలు, ఇరిగేషన్ ఏఈలందరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. దరఖాస్తుదారులకు అవగాహన కల్పించేందుకు వివరాల్లో కరెక్షన్స్ కోసం సంబంధించిన పత్రాలను సమర్పించాలని గ్రామ పంచాయతీల నోటీసు బోర్డులో ప్రదర్శించాలన్నారు. అలాగే ప్రతి మండల కార్యాలయంలో ఈ ఎల్ఆర్ఎస్ గురించి హెల్ప్ డెస్క్ లను ఏర్పాటు చేయాలని, దరఖాస్తుదారులకు తగిన సూచనలు అందించాలని, వారి సందేహాలను నివృత్తి చేయాలని సూచించారు. గ్రామాల వారీగా సర్వే నంబర్ ల ప్రకారం దరఖాస్తుల వివరాలను నమోదు చేయాలని, దీంతో ఫీల్డ్ విజిట్ లో ఇబ్బందులు తలెత్తకుండా తగు చర్యలు చేపట్టాలన్నారు. ఇరిగేషన్ ల్యాండ్స్, నిషేధిత ఆస్తుల వివరాల్లో భూములను కాపాడాలన్నారు. ఘనపూర్ (స్టేషన్), చిల్పూర్, జాఫర్గడ్ లు కుడా మాస్టర్ ప్లాన్ కిందికి వస్తున్నందున విలేజ్ మాస్టర్ ప్లాన్ ప్రకారం రోడ్డు వెడల్పును సరిచూసుకోవాలన్నారు. శనివారానికల్లా ప్రతి గ్రామ పంచాయతీల వారీగా వంద దరఖాస్తుల లక్ష్యంగా ఎల్ఆర్ఎస్ యాప్ లో ప్రణాళికాబద్ధంగా నమోదు చేయాలన్నారు. త్వరితగతిన ఈ ప్రక్రియను పూర్తి చేసిన మూడు మండలాల బృందాలను ఎంపిక చేసి పురస్కరిస్తామని తెలిపారు. అనంతరం పాము కాట్లు, కుక్కల బెడదపై ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అవగాహన సమావేశంలో జెడ్పీ సీఈవో సరిత, డీపీఓ స్వరూప, ఈడీఎం గౌతమ్, అన్ని మండలాల ఎంపీడీవోలు, ఎంపీఓలు, పంచాయతీ కార్యదర్శులు, ఆర్ఐలు, నీటి పారుదల ఏఈలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# పెండింగ్ స్కాలర్‌షిప్స్ విడుదల చేయాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ధర్మభిక్షం

**జనగామ, మన చౌరాస్తా :** రాష్ట్రంలో పెండింగ్ స్కాలర్ షిప్స్‌ను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ధర్మభిక్షం ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం జరిగిన ఎస్ఎఫ్ఐ జిల్లా విస్తృత స్థాయి సమావేశానికి జిల్లా ఉపాధ్యక్షురాలు దాసగాని సుమ అధ్యక్షత వహించగా ధర్మభిక్షం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. స్కాలర్ షిప్‌లు రాకపోవడంలో పేద విద్యార్థులు చదువుకు దూరం అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని కోరారు. లేకుంటే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ఆర్య, శ్రీనాథ్, సంధ్యా, రేఖ, పూజ, కీర్తన, సుధాకర్ పాల్గొన్నారు.




# స్త్రీనిధి రుణాలను రికవరీ చేయాలి

- కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**జనగామ, మన చౌరాస్తా :** స్త్రీ నిధి రుణాలను 50 శాతం రికవరీ చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. బుధవారం సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని ప్రధాన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ తో కలిసి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ జిల్లా పంచాయతీ, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో మండల సమాఖ్య అధ్యక్షులు, ఏపీఎంలతో స్త్రీ నిధి జిల్లా స్థాయి కమిటీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని 12 మండలాల వారీగా మొత్తం టీఎల్ఎఫ్ లు ఒకటి, ఎస్ఎల్ఎఫ్ లు 36 కాగా సెర్ప్ కింద వీఓలు 466 మంది ఉన్నారన్నారు. మహిళా శక్తి పథకం కింద కొత్త ఎంటర్ప్రైజ్ లకు స్త్రీ నిధి అధిక రుణాలను నిబంధనల మేరకు మంజూరు చేయాలన్నారు. క్రెడిట్ ప్లాన్ పెంచాలన్నారు. తక్కువ శాతం స్త్రీ నిధి రుణాల రికవరీ ఉన్న మండలాలు తప్పనిసరిగా 50 శాతం రికవరీకి చేరుకోవాలని సూచించారు. అలాగే 33 నుంచి 55 శాతం రుణాల రికవరీ ఉన్న మండలాలు కచ్చితంగా 65 శాతం లక్ష్యాన్ని సాధించాలని, రఘునాథపల్లి, జనగామ మండలాలు 85 శాతం రుణాల రికవరీ సాధించాలని తెలిపారు. ఈ ప్రక్రియ మొత్తం సెప్టెంబర్ 10 నుంచి 15 లోపు పూర్తవ్వాలని పేర్కొన్నారు. అదే విధంగా పెండింగ్ రుణాల రికవరీకి విజిట్ యాక్షన్ ప్లాన్ ను రూపొందించి పరిష్కరించాలన్నారు. ప్రతి వీఓ ప్రణాళికాబద్ధంగా తగిన చర్యలు చేపట్టాలన్నారు. ఎక్కడైతే స్త్రీ నిధి రుణాల రికవరీ సరిగా చేయకుండా, క్రెడిట్ ప్లాన్ రుణాలను మంజూరు చేయకపోయినా, లబ్ధిదారులను ఇబ్బందులకు గురి చేసినా, అటువంటి వీఓఏలను తొలగిస్తామని కలెక్టర్ హెచ్చరించారు. అంతకుముందు మండల సమాఖ్య అధ్యక్షులు, ఏపీఎంలతో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మండలాల వారీగా సమీక్షించారు. అనంతరం సంబంధించిన లబ్ధిదారులతో మాట్లాడి, వారికి తగిన సూచనలు చేశారు. సమావేశంలో డీఆర్డీఏ వసంత, డీపీఓ స్వరూప, డీఏఓ వినోద్ కుమార్, డీవీహెచ్ఓ ఎస్ఎల్ మనోహర్, అడిషనల్ డీఆర్డీఏ (సెర్ప్) శ్రీనివాస్, మండల సమాఖ్య అధ్యక్షులు, ఏపీఎంలు, స్త్రీ నిధి అసిస్టెంట్ మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.